సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024



కూరగాయల ధరలకు రెక్కలు

వర్షాలు, వరదల ప్రభావంతో కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. కిలోకు రూ.20 నుంచి రూ.40 వరకు ధర పెరిగాయి. 8లో



తెగుళ్ల ముప్పు

భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో వరి పంట ముంపునకు గురైంది. ఎండాకు తెగులు, ఆకుముడత తెగులు వ్యాపించే అవకాశం ఉంది. 8లో



వ్యక్తి దారుణ హత్య

ముదినేపల్లి మండలం ఊటుకూరులో దారుణ హత్య జరిగింది. మృతుడు బాలకోటయ్యను ప్రత్యర్థులు కత్తులతో నరికి పరారయ్యారు. 8లో

న్యూస్‌రీల్

విఘ్నాలు తొలగాలి



వినాయకస్వామిని దర్శించుకుంటున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు

భీమవరం అర్బన్ : రాష్ట్రంలో ప్రజలకు విఘ్నాలు తొలగి అందరూ సుఖసంతోషాలతో ఉండాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ఆకాంక్షించారు. మండలంలోని తాడేరు గ్రామంలో వరసిద్ధి వినాయక స్వామిని ఆయన దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన కుమారుడు కొయ్యే సుందరరాజు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

భీమవరంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు కృషి



కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మను సన్మానిస్తున్న దృశ్యం

భీమవరం : భీమవరంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి భూమిని సేకరించగలిగితే ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు తనవంతు సహకారం అందిస్తానని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం భీమవరం చాంబర్స్ ఆఫ్ కామర్స్ భవనంలో చాంబర్స్ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సుమారు 500 ఎకరాల భూమి అవసరమవుతుందన్నారు. భీమవరంలో 600 ఎకరాల భూమిని సేకరించడానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. అనంతరం మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, కనుమూరు రఘురామకృష్ణంరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్‌ను చాంబర్ ఆధ్వర్యంలో సత్కరించారు. చాంబర్ ఆఫ్ కామర్ అధ్యక్షుడు బొండాడ రామమోహన రావు తదితరులు పాల్గొన్నారు.

'మీ కోసం' రద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో వర్షాల దృష్ట్యా సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన మీ కోసం-ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. డివిజన్, మండల కేంద్రాల్లో కూడా మీ కోసం కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

వర్షాల నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం సెలవు ప్రకటించినట్టు కలెక్టర్ తెలిపారు. సెలవును అన్ని పాఠశాలలు తప్పనిసరిగా అమలుచేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎడతెగని వాన

భీమవరం: జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో జనజీవనం స్తంభించింది. ప్రధానంగా తోపుడుబండ్లు, సైకిళ్లపై వ్యాపారం చేసుకునే వారు, వ్యవసాయ కార్మికులు, కూలీలు పనులు లేక ఇబ్బంది పడ్డారు. ఆదివారం ఉదయం అత్యధికంగా తాడేపల్లిగూడెంలో 58.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా పెంటపాడులో 24.6. తణుకులో 30.2. ఉండలో 20.8. ఇరగవరంలో 10.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మిగిలిన ప్రాంతాల్లో ఓ మోస్తరు వాన పడింది.

శుభకర.. విఘ్నేశ్వర

జయ జయ శుభకర వినాయక.. మహా గణపతిం మనసా స్మరామి.. అంటూ భక్తులు గౌరీ తనయుడిని పూజించారు. జిల్లావ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. పందిళ్లు, ఆలయాలు, ఇళ్లల్లో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజాదికాలు నిర్వహించారు. ఊరేగింపులు, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



నరసాపురం : నరసాపురం పీచుపాలెంలో..



నరసాపురం : నరసాపురం పంజా సెంటర్‌లో విగ్రహం



భీమవరం (ప్రకాశం చౌక్) : గునుపూడిలో విద్యా గణపతి



పెనుమంట్ర : పెనుమంట్రలో గ్రామోత్సవం

పొంగుతున్న వాగులు

వణికిస్తున్న వానలు
- కొల్లేరును ముంచెత్తుతున్న వరద
- తమ్మిలేరులోకి భారీ ప్రవాహం
- పోటెత్తుతున్న ఎర్రకాలువ
- రెడ్ అలర్ట్ నేపథ్యంలో మరింత అప్రమత్తం

ఏలూరు (మెట్రో): జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా బుడమేరు, కొల్లేరు ప్రభావిత మండలాల్లో తహసీల్దార్లు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. కైకలూరు, పెదపాడు, కలిదిండి, మండవల్లి, ఏలూరు రూరల్, నిడమర్రు మండలాలకు అధిక ప్రభావం ఉంటుందని ముంపు ప్రాంతాల్లో పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. కొల్లేరు లంకవాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కొల్లేరు చుట్టూ ఉన్న గ్రామాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మండవల్లి మండలంలోని నాచుమిల్లి ముంపులో మునుగుతోంది. గోగుంట గ్రామంలో 150 మందికి వసంతవాడ హైస్కూల్‌లో పునరావాస శిబిరాన్ని ఏర్పాటుచేశారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉదయానికి 713 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆదివారం సాయంత్రానికి మరో 50 మి.మీ వర్షపాతం నమోదు కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. చాట్రాయిలో అత్యధికంగా 68 మి.మీ వర్షపాతం నమోదైంది.

శనివారపుపేట కాజ్‌వే పైకి నీరు

ఏలూరు (టూటౌన్) :ఏలూరులో అమీనాపేట నుంచి శనివారపుపేట వెళ్లే మార్గంలో కాజ్‌వే పైకి తమ్మిలేరు వరద నీరు చేరడంతో అధికారులు కాజ్‌వేపై రాకపోకలను ఆదివారం రాత్రి నుంచి నిలిపివేశారు. వరద మరింత పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు ముందు జాగ్రత్తగా రాకపోకలను నిలిపివేశారు.



చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు ప్రాజెక్టు నుంచి విడుదల చేస్తున్న నీరు

తమ్మిలేరు నుంచి 4,773 క్యూసెక్కులు విడుదల

చింతలపూడి : తెలంగాణా ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు తమ్మిలేరు జలాశయంలోకి వరద ఉధృతి కొనసాగుతోంది. ఆంధ్రా కాల్వ ద్వారా గంటకు 3,662 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం 4,773 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 347.91 అడుగులకు, గోనెలవాగు బేసిన్ 347.78 అడుగులకు చేరుకుందని తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ పరమానందం తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 3 టీఎంసీలు కాగా 1,806 టీఎంసీలకు చేరుకున్నట్టు చెప్పారు. వర్షాలు కొనసాగుతుండటంతో తమ్మిలేరు ప్రాజెక్టు డీఈ శ్రీనివాసరావు, ఏఈ పరమానందం ప్రాజెక్టు వద్ద మకాం వేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రాజెక్టులో 350 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చని అధికారులు చెప్పారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

600 క్యూసెక్కుల విడుదల

పోలవరం రూరల్ : మండలంలోని ఎల్‌అండ్‌డీపేట రిజర్వాయర్ నిండుకుంది. భారీ వర్షాలతో కొండ వాగుల నీరు రిజర్వాయర్‌లోకి చేరుకోవడంతో 89.85 మీటర్ల నీటిమట్టం చేరుకుంది. రిజర్వాయర్ నీటి సామర్థ్యం 90.50 మీటర్లు కాగా 600 క్యూసెక్కుల నీటిని రెండు గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీరంతా కొవ్వాడ కాలువ ద్వారా పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరి నదిలోకి చేరుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 30.730 మీటర్ల నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే నుంచి 6.11 లక్షలల క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది.

ఎర్రకాలువలోకి పోటెత్తుతూ..

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంలోకి వరద నీరు పోటెత్తుతోంది. గంటకు 3,305 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా డ్యాం గేట్ల ద్వారా గంటకు 3,187 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ శాఖ డీఈ రాంబాబు తెలిపారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 82.02 మీటర్లు ఉంది. వరద నీరు పోటెత్తుతూ దిగువకు పశ్చిమగోదావరి జిల్లా దిశగా పారుతోంది.

గుబ్బల మంగమ్మ ఆలయం మూసివేత

జంగారెడ్డిగూడెం: బుట్టాయగూడెం మండలం కామవరంలోని గుబ్బల మంగమ్మవారి ఆలయాన్ని మూసివేసినట్టు ఆర్డీఓ కె.అద్దయ్య తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో వాగులు పొంగి పొర్లే అవకాశం ఉన్నందున, ఆలయానికి వెళ్లే రహదారులు, రెండు ప్రధాన ద్వారాలు మూసివేసినట్టు చెప్పారు.



ఏలూరులో శనివారపుపేట కాజ్‌వేపైకి చేరిన వరద నీరు



పెద్ద అడ్లగాడ వద్ద వరద పరిస్థితులను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ శివకిషోర్

అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు కలెక్టర్ వెట్రి సెల్వి



ఏలూరు (మెట్రో) : జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికల నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆదేశించారు. ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అప్రమత్తం చేశారు. బుడమేరు, కొల్లేరు ప్రభావిత మండలాల్లో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, పక్కాగా చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు ప్రభావిత బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. కూలేందుకు అవకాశం ఉన్న ఇళ్లలో ప్రజలను ఖాళీ చేయించాలన్నారు. చెరువులు, కుంటల వద్ద గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొల్లేరు ప్రాంత పరిధిలో పశు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. విద్యుత్ సరఫరాలో జాగ్రత్తలు తీసకోవాలని, తాగునీటి ట్యాంకులు కలుషితం కాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

కొల్లేరు ప్రాంతాల్లో ఐజీ పర్యటన

ఏలూరు టౌన్ : భారీ వర్షాలతో బుడమేరు, తమ్మిలేరు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయనీ జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్‌తో కలిసి ఆదివారం ఆయన ఏలూరు రూరల్ మండలం పెద్ద అడ్లగాడ ప్రాంతంలో ఏలూరు-కైకలూరు రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లేరు పరీవాహక ప్రాంతాల్లో వరద నీరు భారీగా చేరుతుందని, కృష్ణా, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో వరద ప్రభావం ఉంటుందనే హెచ్చరికలతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారన్నారు. రహదారులపై బారికేట్లు ఏర్పాటు చేసి ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే పెదపాడు మండలంలోని లోతట్టు ప్రాంతాలను ఐజీ పరిశీలించారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఉన్నారు.

బాబూ.. తీయొద్దు మా జాబు

- మద్యం దుకాణాల ఉద్యోగుల ఆందోళన
- నూతన మద్యం పాలసీతో అగమ్యగోచరం
- ప్రత్యామ్నాయ ఉపాధిపై స్పష్టత కరువు
- జిల్లాలో 202 దుకాణాలు.. 893 మంది సిబ్బంది
- కూటమి ప్రభుత్వ తీరుపై నిరసన బాట

సాక్షి, భీమవరం: నూతన పాలసీతో మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. ఉద్యోగుల కొనసాగింపుపై కూటమి ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. ఉద్యోగాలు పోతే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వారు ఆవేదన చెందుతున్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని కోరుతున్నారు. మద్యం దుకాణాల్లో అక్రమాల కట్టడి, అధిక ధరలు, బెల్టుషాపుల నియంత్రణకు ఐదేళ్లుగా ప్రభుత్వ పర్యవేక్షణలోనే మద్యం దుకాణాల నిర్వహణ సాగింది. ఈ క్రమంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కాయి. ఒక్కో షాపులో సూపర్‌వైజర్, సేల్స్‌మెన్, నైట్‌వాచ్‌మెన్‌లు నలుగురు నుంచి ఐదుగురు చొప్పున పనిచేస్తున్నారు. జిల్లాలో 202 మద్యం దుకాణాలకు గాను సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లుగా 643 మంది, నైట్ వాచ్‌మెన్లుగా 250 మందికి అవకాశం దక్కింది. ఏపీ రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ద్వారా ఉద్యోగ నియామకాలు చేపట్టింది. నెలకు సూపర్‌వైజర్లకు రూ.21,500, సేల్స్‌మెన్లకు రూ.19,500, నైట్ వాచ్‌మెన్లకు రూ.9,500 వేతనంగా అందిస్తోంది.



ప్రభుత్వ మద్యం దుకాణం

నూతన పాలసీతో ఎసరు

రాష్ట్రంలో అక్టోబర్ 1వ తేదీ నుంచి నూతన మద్యం పాలసీ అమలుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఉద్యోగుల భవితవ్యంపై ప్రభుత్వ వైఖరిని ప్రకటించలేదు. షాపుల నిర్వహణ మొత్తం ప్రైవేట్ యాజమాన్యాల చేతుల్లోకి వెళ్లడం వలన దుకాణాల్లో నచ్చిన వారిని నియమించుకుంటారు. దీంతో ఇప్పటివరకు పనిచేస్తున్న తమ పరిస్థితి ఏంటని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

ఆందోళనలో ఉద్యోగులు

ఐదేళ్లుగా ప్రభుత్వం మద్యం దుకాణాలపై ఆధారపడి జీవిస్తున్న వందలాది కుటుంబాలు నూతన మద్యం పాలసీపై ఆందోళనలో ఉన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని కోరుతూ ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆందోళనలకు నిర్ణయించింది. ఇప్పటికే ఉద్యోగులు నిరసన తెలుపుతున్నారు. ఇటీవల భీమవరంలోని ప్రకాశంచౌక్ వద్ద శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈనెల 7న రాష్ట్రవ్యాప్త బంద్‌కు రాష్ట్ర సంఘం పిలుపునివ్వగా విజయవాడ వరదల నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా వేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాను. నూతన పాలసీతో మా ఉద్యోగాలు ఊడిపోయే అవకాశం ఉండటం ఆందోళనకు గురిచేస్తోంది. వందలాది కుటుంబాలు మద్యం దుకాణాలపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పంజా ప్రసాద్, సేల్స్‌మెన్, రాయకుదురు

ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి



ప్రభుత్వ మద్యం పాలసీకి మేం వ్యతిరేకం కాదు. అయితే ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. వరదల నేపథ్యంలో 7న నిర్వహించ తలపెట్టిన సమ్మె వాయిదా పడింది.

– వాడపల్లి రాబేల్, సేల్స్‌మెన్, సీతారాంపురం

ఉధృతంగా ఎర్రకాలువ



మాధవరంలో కాజ్‌వే వద్ద ఎర్రకాలువ వరద

తాడేపల్లిగూడెం రూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో పాటు జంగారెడ్డిగూడెంలోని కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం నుంచి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. దీంతో తాడేపల్లిగూడెం మండలంలో ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. మాధవరం- కంసాలిపాలెం కాజ్‌వేకు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన రహదారిపై నుంచి వరద నీరు శరవేగంగా ప్రవహిస్తోంది. మరో 24 గంటల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో వరద తి మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ఎర్రకాలువ వరదతో పరీవాహక నందమూరు, ఆరుళ్ల, నవాబుపాలెం, మారంపల్లి, జగన్నాథపురం, మాధవరం తదితర గ్రామాల్లో వరి నాట్లు, నారుమడులు పలు మార్లు ముంపునకు గురయ్యాయి. గత నెలలో మూడోసారి ఇతర జిల్లాల నుంచి నారు తెచ్చి రైతులు నాట్లు వేశారు. కొందరు రైతులు నారుమడి పోయడం, మరికొందరు వెదజల్లే విధానంలో ఖరీఫ్ సాగు పునః ప్రారంభించారు. ప్రస్తుతం చేలు మొన దశలోనే ఉన్నాయి. మరోసారి వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడుసార్లు అప్పులు తెచ్చి మరీ నాట్లు వేశామని ఆవేదన చెందుతున్నారు.

క్లుప్తంగా

వరద బాధితులకు నెక్సాన్ రూ.కోటి విరాళం

దెందులూరు: వరదలు, భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో సంభవించిన నష్టాన్ని చూసి తమ వంతు బాధ్యతగా రూ.కోటి విరాళం అందచేస్తున్నామని దీపక్ నెక్సాన్ ఫీడ్స్ ప్రైవేటు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఏవీ సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయంలో చంద్రబాబుకు రూ.కోటి చెక్కును అందించారు. అలాగే బాధిత ప్రజలను ఆదుకుంటామని ముఖ్యమంత్రికి వివరించారు.

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్


పులపర్తి వెంకట రామ ప్రశాంత్

భీమవరం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా భీమవరం పట్టణానికి చెందిన పులపర్తి వెంకట రామ ప్రశాంత్ ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే అంజిబాబు కుమారుడైన ప్రశాంత్ ఆదివారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు.

రైలు ఢీకొని మహిళ మృతి


రైలు ఢీకొని మృతిచెందిన మహిళ

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం–నవాబుపాలెం స్టేషన్ల మధ్య విశాఖ వైపునకు వెళ్లే గూడ్సు రైలు ఢీకొని శనివారం గుర్తు తెలియని మహిళ(50) మృతి చెందినట్టు రైల్వే పోలీసు స్టేషన్ హెచ్‌సీ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. మృతురాలి శరీరంపై తెలుపు రంగు కాటన్ చీర, పసుపు రంగు జాకెట్ ఉంది. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిస్తే 8019157528, 99480 10061 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య

భీమవరం: తల్లి మందలించిందనే మనస్తాపంతో విద్యార్థి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన భీమవరంలో చోటుచేసుకుంది. రైల్వే ఎస్‌ఐ పీటీవీ రమణ ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమవరం పట్టణంలోని కముజువారిపాలెం ప్రాంతానికి చెందిన కముజు బాలాజీ(22) డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. శనివారం బాలాజీ ఇంటివద్ద లేకుండా గణేష్ ఉత్సవాల్లో పాల్గొనడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురై జంక్షన్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో నరసాపురం ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహ్యత చేసుకున్నాడు. రైల్వే స్టేషన్ మాస్టార్ పి అశోక్ కుమార్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమణ తెలిపారు.

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు వాయిదా

ఏలూరు రూరల్: ఈ నెల 11న ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ జట్లు ఎంపిక పోటీలు వాయిదా వేశామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దేవరపల్లి ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని జట్ల ఎంపిక నిలుపుదల చేశామని వివరించారు.

కూరగాయల ధరలకు రెక్కలు

- కేజీ రూ.20 నుంచి రూ.40 వరకూ పెరుగుదల
- భీమవరం మార్కెట్లో ఉల్లిపాయ కేజీ రూ.60
- వర్షాలు, వరదలతో ఒక్కసారిగా ధర పెంపు


భీమవరం బుధవారం మార్కెట్‌లో కూరగాయల దుకాణాలు

భీమవరం(ప్రకాశం చౌక్): వర్షాలు, వరదల ప్రభావంతో కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఈ ఏడాది వర్షకాలం ప్రారంభమైనప్పటి నుంచి విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. భారీ వర్షాల వల్ల జిల్లాలో పలు ప్రాంతాల్లోని కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. దాంతో కూరగాయలకు డిమాండ్ పెరిగింది. కొన్ని కూరగాయలు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నుంచి భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నర్సాపురం మార్కెట్‌కు వస్తాయి. ఈ ఏడాది ఆయా ప్రాంతాల్లో కూడా వర్షాల వల్ల పంటలు దెబ్బతినడం, విజయవాడ వరద కారణంగా కూరగాయల తీసుకొచ్చే వాహనాల కిరాయి పెరిగిపోవడంతో కూరగాయల ధరలు పెరిగాయి. సాధారణంగా కార్తీక మాసంలో కూరగాయల ధరలు పెరుగుతాయి. ఈ ఏడాది వర్షాల వల్ల రెండు నెలల ముందే కూరగాయల ధరలు పెరిగాయి.

కేజీకి రూ.20 నుంచి రూ.40 పెంపు

జిల్లాలో ఏ మార్కెట్ చూసిన కూరగాయలు కిలో గత రెండు నెలలతో పోల్చుకుంటే రూ.20 నుంచి రూ.40 పెరిగింది. స్థానికంగా పండే కూరగాయలు కూడా అదే మాదిరిగా పెరిగాయి. దాంతో సామాన్యులు కూరగాయలు కొనడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికీ వర్షాలు వదలకపోవడంతో జిల్లాలో మిగిలిన ఉన్న కూరగాయ పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. వర్షాల కారణంగా ఉల్లిపాయ కేజీ మార్కెట్‌లో రూ.60 నుంచి రూ.70గా ఉంది. బంగాళదుంప కేజీ రూ.80కి చేరింది. వర్షాల కారణంగా పెరుగుపోతున్న కూరగాయలు ధరలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రకాల కూరగాయలకే రూ.100 ఖర్చవుతుందని, నాలుగైదు రకాల కూరగాయలు కొనడానికి రూ.200 నుంచి రూ.300 ఖర్చు చేయాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. నలుగురు లేదా ఐదుగురు ఉండే కుటుంబంలో కూరగాయలకు వారానికే రూ.800 ఖర్చవుతుందని అంటున్నారు.

రైతు బజారుల్లో ఉల్లిపాయలకు కొరత

గత ప్రభుత్వంలో ఉల్లి, టమోట ధరలు పెరిగిన సమయంలో సామాన్యుడికి అందుబాటులో ఉండేలా ప్రభుత్వం సరఫరా చేసేది. ఈ ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదు. కూరగాయలు ధరలు పెరుగుతున్నప్పటికీ కనీసం రైతు బజారుల్లో ప్రభుత్వం ద్వారా ఒక్క ఉల్లిపాయ కూడా ఇవ్వడం లేదు. దాంతో సామాన్యుడు బయట మార్కెట్‌లో ఉన్న ధరలకే కూరగాయలు కొంటున్నాడు. గత ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి కూరగాయల ధరలు పెరిగిన సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా కూరగాయలను అందించేది. ఈ ప్రభుత్వం ధరల స్థిరీకరణకు నిధులు కేటాయించలేదు. దీంతో పెరిగిన కూరగాయాల ధరలతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు.

జూలై నుంచి ఆగస్టు 15 మధ్యలో ధరలు(రూ.లలో)	
ఉల్లిపాయలు(కిలో)	40 – 60
బంగాళ దుంపలు	50–80
క్యాబేజీ	60–100
బెండకాయ	40–60
వంకాయ	60–100
కాలీఫ్లవర్	40–60
టమాట	20–60
క్యారెట్	40–80
బీట్‌రూట్	20–60
ఆనపకాయలు	20–40

ఆకుకూరలు రూ.20 నుంచి రూ.30 వరకూ పెరిగాయి.

ఘాటెక్కిన ఉల్లి

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి సంత మార్కెట్‌లో ఆదివారం కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటాయి. సంత మార్కెట్‌లో 2 కేజీల ఉల్లిపాయలు రూ.100 కాగా, రిటైల్ మార్కెట్‌లో కేజీన్నర రూ.100 తీసుకుంటున్నారు. ఉల్లిధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఉల్లి ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ఆకివీడు: మండలంలోని రాజులపేట శివారు కొత్తచెరువు ప్రాంతంలో చెరువులో పడి దాసరి వెంగళరావు(58) మృతి చెందినట్లు ఎస్సై నాగరాజు ఆదివారం చెప్పారు. ఈ నెల 6న రాత్రి ఇంటి వద్ద భోజనం చేసి బయటకు వెళ్లిన వెంగళరావు తిరిగి రాకపోవడంతో గ్రామమంతా వెతికారు. 7వ తేదీ మధ్యాహ్నం సమీపంలోని చేపల చెరువులో మృతదేహం కన్పించినట్లు మృతుడి కుమారుడు దాసరి కుమార్ బాబు ఆదివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

టిడ్కో ఇళ్లలోకి పాములు


తాడేపల్లిగూడెంలోని టిడ్కో ఇళ్లలోకి వెళ్తున్న పాము

తాడేపల్లిగూడెం: శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వాన కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు పట్టణంలో 58.8 మిల్లీ మీటర్ల వర్షపాత నమోదైంది. హౌసింగ్ బోర్డు వంటి ప్రాంతంలో కొన్ని ఇళ్లల్లోకి వాన నీరు చేరింది. మున్సిపల్ వర్కర్లు వాననీటిని మళ్లించే ఏర్పాట్లను చేపట్టారు. పట్టణానికి దూరంగా ఉన్న టిడ్కో ఇళ్ల సముదాయం ప్రజలు వాన కారణంగా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ సముదాయాల సమీపంలో పాములు బయటకు వచ్చి టిడ్కో ఇళ్లల్లోకి వెళుతున్నాయి. దీంతో అక్కడి వారు భయంతో వణికిపోతున్నారు.

అశ్లీల నృత్యాలపై కేసులు


తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న డీఎస్పీ మూర్తి. చిత్రంలో సీఐ రమేష్, ఎస్సై జేఎన్‌వీ రమేష్

తాడేపల్లిగూడెం రూరల్/తణుకు: అశ్లీల నృత్యాల ఘటనలో 12 మందిపై కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. ఆదివారం రాత్రి తాడేపల్లిగూడెం రూరల్ సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతూ తాడేపల్లిగూడెం, రూరల్, పెంటపాడు మండలంలో 171 మందికి వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి ఇచ్చామన్నారు. నిబంధనలకు పూర్తి బాధ్యత వహిస్తామని నిర్వాహకుల నుంచి రాతపూర్వకంగా తీసుకున్నామన్నారు. కృష్ణాయపాలెం గ్రామంలో అశ్లీల నృత్యాలు నిర్వహించారని.. ఈ సంఘటనలో డ్యాన్సర్లు, ట్రాక్టర్ డ్రైవర్, యజమాని, నిర్వాహకులు, లైటింగ్, మైక్ సెట్ సమకూర్చిన వారు మొత్తం 12 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తణుకులో కూడా డీఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించారు. వేల్పూరులో అశ్లీల నృత్యాలపై కేసు నమోదు చేశామని చెప్పారు. 9 మందిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఆలస్యంగా వెలుగులోకి..

ఉండి: పండుగ చాటున అశ్లీల నృత్యాల ఘటనపై శనివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 15న వారాల పండుగను పురస్కరించుకుని ఉండి మండలం పెదపుల్లేరు గ్రామంలోని ఓ ఖాళీ స్థలంలో గేదెల నర్సింహులు, కంది వరప్రసాద్ మరో ఆరుగురు హిజ్రాలతో అశ్లీల నృత్యాలు చేయించారు. వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో గ్రామ వీఆర్వో దాసు వీడియోలు, సాక్ష్యాధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిర్వాహకులతో పాటు ఇద్దరు హిజ్రాలను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి దారుణహత్య


హత్యా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు


హత్యకు గురైన బాలకోటయ్య

ముదినేపల్లి రూరల్: వినాయకచవితి రోజు ముదినేపల్లి మండలం ఊటుకూరులో దారుణ హత్య జరిగింది. ఊటుకూరుకు చెందిన పోసిన బాలకోటయ్య(52)కు రెండు జేసీబీలు ఉన్నాయి. శనివారం ఉదయం మలపురాజుగూడెంలో జేసీబీ పని చేస్తుండగా ఆయిల్‌క్యాన్ ఇచ్చేందుకు మోటార్‌బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా ఊటుకూరు సమీపంలో ప్రత్యర్థులు దారికాచి కత్తులు, గొడ్డళ్ళతో నరికి పరారయ్యారు. స్థానికులు ఈ సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేయగా వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ హత్యకు తమ మేనమామలైన గూడవల్లి శివాజీ, శ్రీనుబాబులే కారణమంటూ మృతుని కుమారుడు చైతన్యప్రసాద్ తెలిపాడు. గతంలో తన తండ్రికి మేనమామలకు గొడవలు జరిగాయని కేసులు నడుస్తున్నాయని వీటిని దృష్టిలో పెట్టుకునే చంపారంటూ తెలిపాడు. కైకలూరు రూరల్ సీఐ బి కృష్ణకుమార్, ఎస్సై డి వెంకటకుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోలీసు జాగిలాలు, వేలిముద్ర నిపుణులను రప్పించారు. చైతన్యప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తండ్రి హత్యకు పక్కిరి నాగరాజు, గూడవల్లి శ్రీను, శివాజీ, మహాంకాళరావుతో పాటు మరో ఐదుగురు కారణమంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. నిందితుల కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నట్లు ఎస్సై వెంకటకుమార్ తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో అగ్రస్థానానికి..


ప్రతిభ కనపర్చిన విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న తిరుచ్చి ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ శర్మ తదితరులు

తాడేపల్లిగూడెం: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తే అగ్రస్థానానికి చేరుకోవచ్చని తిరుచిరాపల్లి ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీఎస్ నరసింహ శర్మ అన్నారు. వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో 2023–24 సంవత్సరంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని వెళ్తున్న విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదాన కార్యక్రమం ఆదివారం కోలాహలంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శర్మ మాట్లాడుతూ ఇంజినీరింగ్ డిగ్రీ ఉపాధికి పనికి వచ్చేదే కాకుండా దేశానికి పనికి వచ్చేలా ఉండాలన్నారు. ఉద్యోగిగా ఉపాధి మార్గాలు పొందినచోట సక్రమంగా పనిచేయకపోతే ఉద్వాసనలు తప్పవని ట్రిపుల్ ఎఫ్ అధినేత ఓపీ గోయెంకా, ఐఐటీ తిరుపతి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి మామిళ్ల రవిశంకర్‌లు అన్నారు. ఉత్తమ విద్యార్థినిగా ఎంపికైన పండా శ్రీపావనికి బంగారు పతకం అందచేశారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, ఉపాధ్యక్షుడు కోట్ల వెంకట రామకృష్ణారావు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్‌తో ఉద్యోగావకాశాలు


భీమవరంలో బాడీ బిల్డింగ్ పోటీలు ప్రారంభిస్తున్న సీఐ నాగరాజు

భీమవరం: బాడీబిల్డింగ్ ద్వారా యువత దేహదారుఢ్యానికేగాకుండా ఉద్యోగావకాశాలు పొందవచ్చని వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు అన్నారు. అంబేడ్కర్ భవన్ వెస్ట్ గోదావరి బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిస్టర్ వెస్ట్ గోదావరి బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్–2024 పోటీలను ఆదివారం ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. పోటీల నిర్వాహకుడు షేక్ ఖాసీం మాట్లాడుతూ మిస్టర్ వెస్ట్ గోదావరి బాడీ బిల్డింగ్ పోటీలు 12 విభాగాల్లో నిర్వహిస్తారన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు కఠారి రవిశంకర్, గౌరవాధ్యక్షుడు జాని, వాడపల్లి శ్రీనివాసరాజు, విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, వలవల ఫణి, తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ మాయంపై కేసు నమోదు

తణుకు: తణుకు మండలం పైడిపర్రులోని విఘ్నేశ్వర స్వామి మండపంలో లడ్డూ మాయం ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. శనివారం రాత్రి మండపంలోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు లడ్డూ అపహరించుకుపోయారని నిర్వాహకుడు గంటా నాగేశ్వరరావు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అనుమానం ఉందని ప్రశ్నించినందుకు యర్రంశెట్టి సాయిసతీష్, తాటికాయన సురేష్ మరో నలభై మంది తనపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి


ప్రకాష్, మృతుడు (ఫైల్)

చాట్రాయి: ప్రమాదవశాత్తూ చెరువు వరదలో వ్యక్తి మృతి చెందిన సంఘటన లింగపాలెం మండలం తువ్వచిలక రాయుడుపాలెంలో జరిగింది. పోదిలి సూర్య ప్రకాష్(35)ఆదివారం తన ద్విచక్ర వాహనంపై మరో వ్యక్తితో కలిసి మండలంలోని తుమ్మగూడెం వస్తున్నాడు. గ్రామంలోని చెరువు అలుగు పడి రోడ్డు మీద ప్రవహిస్తున్న నీటి గుంతలో పడడంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. మృతుడికి భార్య, పాప, బాబు ఉన్నారు.

నక్కల డ్రెయిన్‌లో పడి వ్యక్తి మృతి


గెద్దాడ వెంకట ప్రసాద్


పాలకొల్లు అర్బన్: పోడూరు మండలం వద్దిపర్రు శివారు మొండిగరువుకి చెందిన ఆక్వా రైతు గెద్దాడ వెంకట ప్రసాద్ (39) నక్కల డ్రెయిన్‌లో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడని ఇన్‌చార్జి ఎస్సై వెంకటరమణ తెలిపారు. ప్రసాద్ శుక్రవారం రాత్రి తండ్రి వీరభద్రరావును ఆక్వా చెరువు వద్ద దింపి ఇంటికి వెళ్లారు. వీరభద్రరావు శనివారం ఉదయం ఇంటికి వెళ్తూ డ్రెయిన్ వంతెన వద్ద ప్రసాద్ బైక్, చెప్పులు కనిపించడంతో అనుమానం వచ్చి ఇంటికి ఫోన్ చేసి ప్రసాద్ భార్యను వివరాలు అడిగారు. ప్రసాద్ రాత్రి ఇంటికి రాలేదని చెప్పడంతో వీరభద్రరావు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో ఫైర్ సిబ్బంది సహకారంతో నక్కల డ్రెయిన్‌లో వెదకగా ప్రసాద్ మృతదేహాన్ని శనివారం సాయంత్రం గుర్తించారు. ప్రసాద్ శుక్రవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయినట్లు అనుమానిస్తున్నారు. మృతదేహానికి పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఏలూరు టౌన్: ఏలూరు పత్తేబాద ప్రాంతంలో ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పత్తేబాద చిన్న శివాలయం సమీపంలో కే.గిరి నరేష్ (38) కొంత కాలంగా ఒంటరిగా ఉంటున్నాడు. తల్లిదండ్రులు, భార్య చనిపోగా ఒంటరిగా నివసిస్తున్నాడు. టైల్స్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అతను కామెర్ల వ్యాధితో బాధపడుతుండగా, మద్యం సేవించేవాడని స్థానికులు చెబుతున్నారు. అతను ఉంటున్న ఇంటి నుంచి దుర్వాసన రావటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండు, మూడు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారీ వర్షాలతో తెగుళ్ల ముప్పు

వరిలో సస్యరక్షణ చర్యలు




మెట్ట ప్రాంతంలో అధిక వర్షాలకు వరి చేలల్లో నీరు చేరిన దృశ్యం(ఫైల్)

చింతలపూడి: అల్పపీడనంతో కురుస్తున అధిక వర్షాలకు వరి పంట ముంపునకు గురైంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఎండాకు తెగులు, ఆకుముడత తెగులు వ్యాపించే అవకాశం ఉంది. ముంపుకు గురైన వరి పంటలో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలపై వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగకుమార్ రైతులకు పలు సూచనలు చేశారు.

నారుమడి/ఎద పద్ధతిలో విత్తిన పొలం మునిగితే

- వర్షాలకు నారుమడిలో విత్తనం చల్లిన 2–3 రోజుల వయసులో 3 రోజులకు మించి నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది. వీలైనంత త్వరగా నీరు బయటకు తీసి వేయాలి.
- విత్తిన 7 నుండి 30 రోజుల మధ్యలో నారు 5 రోజుల కన్నా ఎక్కువ మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉంది. ఎంటీయూ 1232 రకం విత్తిన 15 నుంచి 70 రోజుల వరకు ముంపును తట్టుకుంటుంది. మునిగిన నారుమడిలో నుంచి నీరు 5 రోజులలోపు నీరు పూర్తిగా బయటకు తీసి వేసిన తర్వాత, 5 సెంట్ల నారుమడికి కిలో యూరియా + కిలో పోటాష్ వేసుకోవాలి. కార్బన్‌డిజిమ్ + మాంకోజెబ్ పిచికారీ చేయాలి.

పిలకల దశలో మునిగితే..

పిలకల దశలో 5 రోజుల వరకు నీట మునిగినా బతికే అవకాశం ఉంది. పిలకల దశలో పంట మునిగితే నీరు బయటకు పోయిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా+ 20 కిలోల పోటాష్ అదనంగా వేసుకోవాలి.

ఎండాకు తెగులు ఆశిస్తే..

ఎడతెరిపి లేని వర్షాలు కురిసే ప్రాంతాలలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించే అవకాశం ఉంది. తెగులు నిర్ధారణ కోసం ఎండిన ఆకులను ముక్కలుగా కత్తిరించి మంచి నీటితో ఉన్న గాజు గ్లాసులో వేయాలి. అరగంట తరువాత గమనించినట్లయితే, తెగులు ఆశించిన భాగాలనుండి బాక్టీరియా నీటిలోకి ప్రవేశించడం వల్ల నీటి గాఢత పెరిగి పసుపు రంగుకు మారుతుంది. తెగులు లక్షణాలు గమనించిన వెంటనే పొలంలో నిలిచిన నీటిని 2 – 3 సార్లు మురుగు నీటి కాలువల ద్వారా బయటకు తీసివేసి కొత్త నీరు పెట్టాలి. సిఫారసు చేసిన పొటాష్‌ను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా నాట్లువేసే సమయంలోనూ, చిరుపొట్ట దశలోనూ వేయాలి. తెగులు సోకిన పొలానికి నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. ముఖ్యంగా బీపీటీ 5204, ఎంటీయూ 1121, ఎంటీయూ 1318 రకాలకు నత్రజని నియంత్రించాలి.

పొడ తెగులు ఆశిస్తే..

వరి పంటపై పాము పొడ తెగులు ఆశిస్తే నివారణకు లీటరు నీటికి 2.0 మి.లీ హెక్సాకొనజోల్ 5% ఈసీ లేదా 2.0 మి.లీ వాలిడామైసిన్ 3 లీ లేదా 1.0 మి.లీ ప్రోపికొనజోల్ 25% ఈసీ లేదా 0.4 గ్రా ట్రిఫ్లాక్సీస్ట్రోబిన్ 25%+ టెబుకొనజోల్ 50% డబ్ల్యూజీ లేదా 1.5 మి.లీ అజాక్సీస్ట్రోబిన్ 11% + టెబుకొనజోల్ 18.3% డబ్ల్యూజీ లేదా 1.0 మి.లీ అజాక్సీస్ట్రోబిన్ 25% మందులలో ఏదో ఒక దాన్ని 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు మార్చి పిచికారీ చేయాలి.

ఆకుముడత నివారణకు..

ఆకుముడత నివారణకు లీటరు నీటికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రా. లేదా క్లోరాన్ట్రిప్రోల్ 0.3 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. చిరుపొట్ట దశలో ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోలు వేసుకోవాలి. దోమ ఎక్కువగా ఆశించే ప్రాంతాల్లో ఈ పురుగుల నివారణకు ప్రొఫెనోఫాస్, ట్రైజోఫాస్, క్లోరిపైరిఫాస్, మోనోక్రోటోఫాస్, సింథటిక్ పైరిత్రాయిడ్ వంటి మందులు పిచికారీ చేయకూడదు.


బి.నాగకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయ శాఖ

క్లుప్తంగా

నిత్యావసరాల అందజేత



ఓ వృద్ధురాలికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వల్లి, మోహన్ యువ జన సేవా సమితి సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నెలవారి కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు ఒకొక్కరికి 20 కేజీల బియ్యం, ఆయిల్ ప్యాకెట్లు, కూరగాయలు, నిత్యావసర వస్తువులు అందజేశారు. రాంపండు, తిలక్, మోహన్, ఉండ్రాజవరపు భాస్కర రావు, దినేష్, సతీష్, మధు పాల్గొన్నారు.

డైమండ్స్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం



విజయవాడ ముంపు ప్రాంతంలో ఓ మహిళకు కిట్‌ను అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): డైమండ్స్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్ క్లబ్ జిల్లా కో–ఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో రెండు టీంలు విజయవాడలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం ఫైర్ ఆఫీసర్ గణేష్న వెంకట రామారావు, లియో ధనలక్ష్మి, మాధురి, దినకర్, తమ్మిన జగదీశ్వరరావుల ఆర్థిక సహకారంతో ఆదివారం విజయవాడలోని ముంపు ప్రాంతాల్లో ప్రజలకు పాలు, బిస్కెట్లు, వాటర్ ప్యాకెట్లు, బెడ్ షీట్లు అందించారు. వక్తలు మాట్లాడుతూ ప్రతి ఇంటికి సాయం అందేలా కృషి చేసినట్లు చెప్పారు. చెన్నారెడ్డి సతీష్, ఆకుల సతీష్, నార్ని వెంకట కృష్ణారావు, మునగాల జితేంద్ర, గురుస్వామి, పేరిచర్ల వీరభద్రరాజు, ఆకుల సుబ్బు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ



మంచిలిలో సీఎం సహాయ నిధికి విరాళాలు సేకరిస్తున్న ప్రజలు

అత్తిలి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆదివారం అత్తిలి మండలం మంచిలిలో ప్రజలనుంచి విరాళాలు సేకరించారు. మంచిలి భగవాన్ పూతరేకుల యజమాని శిరగాని భగవాన్, శిరగాని నాగు వరద బాధితుల సహాయార్థం రూ.10 వేలు, రూ.1 లక్ష విలువగల పూతరేకులను అందజేశారు. గ్రామంలో ప్రజల నుంచి రూ.లక్ష ఎనిమిది వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని సీఎం సహాయ నిధికి పంపిస్తామని ప్రజలు తెలిపారు.

బస్‌పాస్‌ల పంపిణీ



బస్‌పాస్‌లు అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లు అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ అన్నారు. తణుకు స్వర్ణ లయన్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ చిట్టూరి సుజాత ఆర్థిక సాయంతో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్, ఏకేటీపీ హైస్కూల్‌కు చెందిన 200 మంది విద్యార్థులకు శనివారం ఉచిత బస్‌పాస్‌లు అందజేశారు. ఈ సందర్భంగా దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు ఉపయోగకరంగా ఉంటున్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్వర్ణ లయన్స్ క్లబ్ సభ్యులు, డిపో సూపరింటెండెంట్ బీవీకే రావు, ఆర్టీసీ ఉద్యోగి ములగాల వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

సంచార వైద్యశాలలో వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహించే ఇంటింటికి వైద్యసేవల కార్యక్రమంలో 5 గురు వృద్ధులకు వైద్య సేవలు అందించామని అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, ఎముకల వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, దువ్వ, కె.సావరం పరిసర గ్రామాల్లో మంచం నుంచి లేవలేని వృద్ధుల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి, సూచనలు, సలహాలు అందించారు. సంఘ సభ్యులు దాట్ల రామరాజు ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎండీ స్వాహాలిక, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జయ జయ శుభకర వినాయక



పేరిచర్ల ఆధ్వర్యంలో ఉత్సవ పందిరి వద్ద జరుగుతున్న పూజలు



వినాయకుడి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



అత్తిలి రజక వీధిలో శ్రీస్వామివారి ఊరేగింపులో కాళికామాత నృత్యాలు



తణుకు అర్బన్: భారీ గణనాథుడిని దర్శించుకుంటున్న భక్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వినాయక చవితి పండుగ సందర్భంగా తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లో గ్రామగ్రామన గణనాథులు కొలువుదీరారు. పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిర్లలో పలు ఆకృతుల్లో వినాయకుని విగ్రహాలను నెలకొల్పి విశేష పూజలు చేశారు. తాడేపల్లిగూడెంలో పలు చోట్ల గణనాథుని విగ్రహాలను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించారు. గణనాథుని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజల అందరికి ఉండాలని ఆకాంక్షించారు. పేరిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ఉత్సవ పందిరిలను దర్శించారు. పూజలు జరిపారు. ఒక వైపు వర్షాలు పడుతున్నప్పటికీ పట్టణంలో పలు ప్రాంతాలలో పిల్లలు, పెద్దలు, మహిళలు ఆధ్వర్యంలో వాడవాడలా ఉత్సవ పందిర్లు వేసి వివిధ ఆకారాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పెంటపాడు: గణపతి నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని వాడవాడలా ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవాలు పందిళ్ల వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు శనివారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు పురస్కరించుకుని పలు గ్రామాల్లో భారీ ఊరేగింపులు, ప్రత్యేక పూజలు, అదేరోజు కొన్ని గ్రామాల్లో నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. తీన్‌మార్ డప్పులు, బాణసంచా కాల్పులు, నృత్యా ల నడుమ వినాయకుని



పట్టణ టాక్సీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు

విగ్రహాలను పలు గ్రామాలలో ఊరేగించారు. పెంటపాడులో పలు ప్రాంతాల్లో ఊరేగింపులు ఘనంగా జరిగాయి. అనంతరం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. కొబ్బరితోట యూత్, బండారు అప్పలస్వామి వీధి ప్రాంతాల్లో పందిర్ల వద్ద పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆటల పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

అలంపురంలో ఆకట్టుకున్న గణేశ మందిరం

వినాయక చవితిని పురస్కరించుకుని అలంపురం టీబీఆర్ సంస్థల ఆధ్వర్యంలో జాతీయ రహదారి పక్కన పురాతన మందిరం తరహాలో చైర్మన్



అలంపురంలో పూజలందుకుంటున్న గణేశుడు

కోలాహలంగా ఊరేగింపులు

తనబుద్ది భోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెట్టింగ్ భక్తులను ఆకట్టుకుంటోంది. ఈ వేదిక వద్ద ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. 9 రోజుల పాటు ఇక్కడ ఉత్సవాలు చేస్తామని భోగేశ్వరరావు చెప్పారు.

భక్తి శ్రద్ధలతో చవితి వేడుకలు

తణుకు టౌన్: వినాయక చవితి వేడుకలను తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తణుకు మండలం వేల్పూరులో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తణుకు పట్టణంలో ముళ్లపూడి తిమ్మరాజా గ్రంథాలయంలో వినాయక చవితి సందర్భంగా మాజీ



అలంపురం హైవే వద్ద గణేశుని మందిరం

మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ ముళ్లపూడి రేణుక, డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలకు ప్రత్యేక మందిరాన్ని ఏర్పాటు చేశారు. వేల్పూరులోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వినాయకుడి ఆలయం వద్ద వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో వినాయకుడి ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు.

గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

అత్తిలి: గణపతి నవరాత్రి మహోత్సవాలు మండలంలో వాడవాడలా ఘనంగా ప్రారంభమయ్యాయి. అత్తిలి గణేష్ చౌక్ సెంటర్‌లో వరసిద్ధి వినా



పట్టణంలో ఉత్సవ పందిరిలో గణనాథుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

యక ఆలయం వద్ద బల్లంకి వెంకట నాగ శ్రీను, నాగ వెంకట దుర్గా గాయత్రి దంపతులచే గణపతి నవరాత్రి కలశ స్థాపన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయకచవితి

తణుకు అర్బన్: వినాయక చవితి మహోత్సవ వేడుకలు పట్టణంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయాలతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో వైభవంగా నిర్వహించారు. తణుకు కొచ్చెర్లకోట వీధిలో నియోజకవర్గంలో అతి పెద్ద 20 అడుగుల విగ్రహం ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ముగ్గురు భక్తులు ఆదివారం వేరువేరుగా విరాళాలు అందజేశారు. అందులో భాగంగా తాడేపల్లిగూడెంకు చెందిన కొండేటి వీరవెంకట సూర్యకుమారి రూ:1,01,201 ఆలయ కార్యాలయంలో జమచేయగా దాతకు ఆలయ ఏఈవో పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు. అలాగే ఏలూరుకు చెందిన రాయప్రోలు వెంకట రామ వినయ కౌశిక్ రూ: 1,01,116 నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేయగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ డీవీఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. అలాగే ఏలూరుకు చెందిన సేనం



దాత సూర్యకుమారికి విరాళం బాండ్ పత్రాన్ని అందజేస్తున్న ఏఈవో పి. నటరాజారావు

శ్రీకాంత్ రూ. 27 వేలను విరాళంగా అందజేయగా దాతకు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

అన్నదాతకు వాయు గండం

పెనుగొండ: అన్నదాతకు మరోసారి గుండె గుబేలుమంటుంది. ఇప్పటికే ఈ సీజన్‌లో మూడోసారి భారీ వర్షాలు కురుస్తుండడంతో వాయు గుండాలు రైతుల పాలిట గండంగా మారాయి. రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలకే ఆచంట వేమవరంలో వరి చేలు నీట మునిగాయి. ఇపుడు మరోసారి మూడు రోజులు భారీ వర్షాల హెచ్చరికలతో రైతుల్లో కలవరం మొదలైంది. ఇప్పటికే జూలైలో కురిసిన భారీ వర్షాలతో ముఖ్యంగా నక్కల డ్రెయిన్ ప్రాంతంలో రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. ఆచంట వేమవరంలో రోజుల తరబడి వరి చేలల్లో నీరు నిలిచి పోవడంతో ఆకుమడులు పూర్తిగా కుళ్లిపోయాయి. నాట్లు వేసిన వరి చేలు కుళ్లిపోవడంతో వరి నారు బయటి నుంచి తెచ్చుకొని రెండో సారి ఊడ్చారు. దీంతో ఒక్కో రైతుకు ఎకరాకు రూ.15 వేల వరకూ అదనపు ఖర్చు అయింది. వైఎస్సార్ ప్రభుత్వంలో బీమా సకాలంలో చేతికి అందడంతో రైతులకు నష్టం లేకుండా ఉండేది. అయితే, ఇప్పటి వరకూ బీమాపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో రైతులు దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారు. జూలైలో భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన రైతన్నలకు బీమా ఎప్పటికి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

రెండు రోజులుగా వర్షపు నీటిలోనే

ఆచంట మండలం ఆచంట వేమవరంలోని వరి చేలు రెండు రోజులుగా వర్షపు నీటిలోనే మునిగి ఉన్నాయి. అల్ప పీడనంతో మరో మూడు రోజులు



ఆచంట వేమవరంలో మునుగుతున్న వరిచేలు

వర్షం కురిసే అవకాశం ఉండడంతో వరి చేలు పూర్తిగా కుళ్లిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక సాగు కష్టమేనంటూ వాపోతున్నారు. వర్షాలు ఇలా కురుస్తూ ఉంటే దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉందంటూ ఆందోళన చెందుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



ప్రతీ ఏటా వర్షాకాలంలో నక్కల డ్రెయిన్ ఉధృతితో ఆచంట వేమవరంలో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. రెండు, మూడు సార్లు నాట్లు వేసుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. రైతులను ఆదుకోవడానికి శాశ్వత పరిష్కారం చూపాలి

జక్కంశెట్టి చంటి, సర్పంచ్, ఆచంట వేమవరం

స్థిరంగా గోదావరి ప్రవాహం



వలందర్‌రేవు వద్ద గోదావరి ప్రవాహ దృశ్యం

నరసాపురం: వశిష్ఠ గోదావరి ప్రవాహం స్థిరంగా కొనసాగుతుంది. ఇంకా నీటిమట్టం సాధారణ స్థితికి చేరుకోలేదు. దీంతో గోదావరి పరివాహక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భద్రాచలంలో నీటిమట్టం తగ్గుతూ ఉండటంతో ఎగువ ప్రాంతాల నుంచి వశిష్ఠ గోదావరిలోకి నీరు భారీగా వచ్చి చేరుతుంది. భారీగా వస్తున్న నీరు సముద్రంలో కలుస్తుంది. అయితే సముద్రం పోటు సమయంలో నీరు నిలిచిపోవడంతో స్థానికంగా నీటిమట్టం పెరుగుతుంది. ఎగువ ప్రాంతాల నుంచి సముద్రంలో కలవడానికి నీరు వస్తూ ఉన్నంత వరకూ స్థానికంగా నీటిమట్టం పెరుగుతూనే ఉంటుంది. వలందర్ రేవులో స్నానాల రేవు వద్ద ప్రమాదకర స్థితిలో నీటి ప్రవాహం ఉంది. మాధవాయిపాలెం రేవులో పంటు రాకపోకలు ఆదివారం కూడా కొనసాగించలేదు. పై ప్రాంతాల్లో వరద తీవ్రత తగ్గినా మరో రెండు మూడు రోజులు నరసాపురంలో గోదావరి ఉధృతి అలాగే ఉంటుంది.

తగ్గుముఖం పట్టిన గోదావరి

యలమంచిలి: అధిక వర్షాల వలన గోదావరికి వరద రావడంతో మూడు రోజులుగా కనకాయలంక వద్ద కాజ్‌వే నీట మునిగింది. దీంతో కనకాయలంక ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా అధికారులు ఇంజన్ పడవలు ఏర్పాటు చేశారు. గోదావరిలో వరద ఆదివారం సాయంత్రం నుంచి తగ్గుముఖం పట్టింది. ఈ విధంగా గోదావరిలో నీరు తగ్గితే సోమవారం సాయంత్రానికి కాజ్‌వే వరద నుంచి బయటపడొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఆదివారం వర్షం కురవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి.

తుఫానుతో స్తంభించిన జన జీవనం



రాష్ట్రపతి రోడ్డులో డ్రైనేజీలు పొంగడంతో రోడ్డుపై చేరిన నీరు



టౌన్‌హాల్ కాంప్లెక్స్ వద్ద వర్షపునీటిలో వాహనదారుల ఇబ్బందులు

రోడ్లు జలమయం

తణుకు: వారం క్రితం అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వారం రోజుల నుంచి కురిసిన వర్షానికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అయితే మరోసారి బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తణుకు నియోజకవర్గ వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తోంది. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగి ప్రవహిస్తుండటంతో ప్రధాన రోడ్లపైకి వర్షపు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం వినాయక చవితి రోజున సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. దీంతో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి మండపాలు వర్షం, ఈదురు గాలులకు కూలిపోయాయి. ఆదివారం సైతం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు విద్యార్థులు ఇబ్బందులు పడకూడదని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు. దీంతో తణుకు నియోజకవర్గంలోని స్కూళ్లు, కాలేజీలకు సోమవారం సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించి విద్యా సంస్థలు కొనసాగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజా కళాకారుడు గరికపాటికి నివాళి

భీమవరం: కళాప్రదర్శనలతో ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ప్రజా కళాకారుడు డాక్టర్ గరికపాటి రాజారావు కృషి చేశారని ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన గరికపాటి వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో పాటలు, బుర్రకథలు, హరికథలు, నాటకాలు, జానపద కళారూపాల ద్వారా ఎందరో కళాకారులను సమీకరించి ప్రజలను చైతన్యవంతులు చేయడమే కాక ఉచిత వైద్యం చేసి రాజారావు మానవత్వాన్ని చాటారన్నారు. తొలుత రాజారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వేల్పు ల నాగేశ్వరావు, చాన్ భాషా, జవ్వాది దాశరధి శ్రీనివాస్, అక్వా శ్రీనివాస్ పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం



జెడ్పీటీసీ నడపన

పాలకొల్లు అర్బన్: విజయవాడ వరద నీటిలో మునిగిపోవడానికి చంద్రబాబు వైఫల్యమే కారణమని జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు విమర్శించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. బాధితులకు సహాయక చర్యలు చేపట్టడంలోనూ అధికార యంత్రాంగం తప్పిదం కనిపిస్తోందన్నారు. కనీసం ముందస్తు హెచ్చరికలు కూడా చేయలేదన్నారు. బుడమేరు కారణంగా విజయవాడకు ముప్పు ఏర్పడుతుందని అధికారులకు, చంద్రబాబుకు తెలుసునని, అయినా వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించలేకపోయారన్నారు. వరద ముంపు కారణంగా 50 మందికి పైగా మృత్యువాత పడ్డారని దుయ్యబట్టారు. ప్రతీ నెలా రేషన్ సరుకులు అందించే వాహ నాలను సైతం నిలుపుదల చేశారని, ప్రస్తుతం అవే వాహనాలు వరద బాధితులకు ఆహార పొట్లాలు అందించేందుకు ఉపయోగపడుతున్నాయన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందస్తు ఆలోచనలతో పాలన సాగించేవారన్నారు. వలంటీర్ వ్యవస్థ కరోనా సమయంలోనూ, వరద ప్రభావిత ప్రాంతాల్లో విశేష సేవలందించి, దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందారని జెడ్పీటీసీ గోవిందరాజుల నాయుడు గుర్తు చేశారు.

డాక్టర్ భవాజీ రూ.లక్ష విరాళం

తాడేపల్లిగూడెం: వరద బాధితుల సహాయార్థం సీఎం సంక్షేమ నిధికి పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు నార్ని భవాజీ ఆదివారం రూ. లక్ష చెక్కు ను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసుకు అందజేశారు. ఆయనతోపాటు కుటుంబసభ్యులు ఉన్నారు.

వరద బాధితులకు దాతల చేయూత



వరద బాధితుల సహాయార్థం చెక్కులు అందజేస్తున్న దాతలు

తణుకు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం తణుకు నియోజకవర్గంలో పలువురు దాతలు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు ఆదివారం తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణను కలిసి సీఎం సమాయ నిధి కోసం చెక్కులను అందజేశారు. తణుకు పట్టణానికి చెందిన ముళ్లపూడి మృత్యుంజయ ప్రసాద్ రూ.2 లక్షలు, వై.నారాయణరావు రూ.1 లక్ష, డాక్టర్ కోసూరి సత్యనారాయణరాజు రూ.50 వేలు, దాసం బాబ్జి రూ.10 వేలు, అత్తిలి లయన్స్ క్లబ్ రూ.25 వేలు చెక్కులను ఎమ్మెల్యే రాధాకృష్ణ చేతుల మీదుగా అందజేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ఉండి: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎండీ నసీరుల్లా ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఉత్సవాల్లో అశ్లీల నృత్యాలు వంటివి నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మత్తు పదార్థాలను సేవించి గొడవలను ప్రేరేపించడం చేసే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.